సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం । 19 । జూలై । 2023



ప్రతిష్టాత్మకంగా రొట్టెల పండగ
ఈ నెల 29వ తేదీ నుంచి నెల్లూరులోని బారాషహీద్ దర్గా వద్ద రొట్టెల పండగను ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు కమిషనర్ వికాస్ మర్మత్ తెలిపారు. - 8లో



బంగారం ధరలు
24 క్యారెట్లు (10 గ్రాములు) - రూ.61,300
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా) - రూ.5,505
3 శాతం జీఎస్టీతో.. - రూ.5,670
సవర (8 గ్రా) - రూ.45,360

గరిష్టం/కనిష్టం
34.6 /28.4

వాతావరణం
మంగళవారం గాలిలో తేమ 57 శాతం ఉంది. బుధవారం వాతావరణం చల్లబడి జిల్లాలో పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

నందవరం-ఉదయగిరి రోడ్డును తక్షణం పునర్నిర్మించండి

- కేంద్ర మంత్రి గడ్కరీకి మాజీ ఎంపీ మేకపాటి లేఖ



మేకపాటి రాజమోహన్‌రెడ్డి

ఆత్మకూరురూరల్/ నెల్లూరు(దర్గామిట్ట): మర్రిపాడు మండలం నందవరం వద్ద 67వ నంబరు జాతీయ రహదారి నుంచి నందిపాడు మీదుగా 565 నంబరు జాతీయ రహదారిని తాకుతూ ఉదయగిరి వరకు ఉన్న ప్రధానమైన రోడ్డు ధ్వంసమై రాకపోకలు సాగించే ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారుల శాఖ ఆధ్వర్యంలో ఈ రోడ్డు పునర్నిర్మాణానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి మంగళవారం లేఖ రాశారు. 31 కిలోమీటర్ల నిడివి గల ఈ రోడ్డు 4 జాతీయ రహదారులను అనుసంధానం చేస్తుందన్నారు. 67, 167, 565 నంబర్ల జాతీయ రహదారుల నుంచి ఉదయగిరికి రాకపోకలు సాగించే వారికి ఇది అత్యంత కీలకమైన రోడ్డుగా మేకపాటి పేర్కొన్నారు. ఈ మార్గాన్ని సువిశాలంగా పునర్నిర్మించి ఇప్పటికే ఉన్న 4 జాతీయ రహదారులకు అనుసంధానం చేసేందుకు ప్రభుత్వపరంగా అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి చర్యలు తీసుకోవాలని మేకపాటి తన లేఖలో విజ్ఞప్తి చేశారు.

సుస్థిర నగరాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

నెల్లూరు(బారకాసు): సుస్థిర నగరాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీలక్ష్మి తెలిపారు. మంగళవారం విజయవాడ నుంచి ఆమె కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కోటేశ్వరరావుతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ పట్టణ పర్యావరణాన్ని పెంపొందించే ప్రణాళికలు, వాటి నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. అదేవిధంగా నగరంలో సోలార్ పార్కుల ఏర్పాటు, పాదచారుల నడక మార్గాల నిర్మాణం వంటి అంశాలపై తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కమిషనర్ వికాస్‌మర్మత్, జిల్లా అటవీశాఖ అధికారి చంద్రశేఖర్, ఇంజినీరింగ్ విభాగం ఎస్‌ఈ సంపత్‌కుమార్, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఫెర్టిలిటీ, ఏఆర్టీ కేంద్రాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

నెల్లూరు(బారకాసు): జిల్లాలోని ఫెర్టిలిటీ, అసిస్టెంట్ రీప్రొడక్టివ్ టెక్నాలజీ (ఏఆర్‌టీ) కేంద్రాలతోపాటు సరోగసి (సర్జరీ) కేంద్రాలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ పెంచలయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏఆర్‌టీ నేషనల్ పోర్టల్‌లో నిర్దేశించిన రిజిస్ట్రేషన్ రుసుము మొత్తం డీడీతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వీటిని జిల్లాస్థాయి తనిఖీ బృందం పరిశీలించిన అనంతరం సర్టిఫికెట్ జారీకి కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీకీ సిఫార్సు చేయడం జరుగుతుందన్నారు. అనుమతులు లేని స్కానింగ్, ఏఆర్‌టీ కేంద్రాలపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పొదలకూరు యార్డు

నిమ్మ మార్కెట్‌కు ప్రసిద్ధి



సీజన్‌లో

రూ.50 లక్షల మేర కాయల ఎగుమతులు

- పెరుగుతున్న వ్యాపారుల సంఖ్య
- మార్కెట్‌లో అదనపు దుకాణాల నిర్మాణం
- కోట్లాది రూపాయలతో వసతుల కల్పన
- రైతులకు లాభసాటి ధరలు



రైతుల నుంచి వచ్చిన నిమ్మకాయలను ప్యాకింగ్ చేస్తున్న వ్యాపారులు

జిల్లాలో ప్రత్యేక గుర్తింపు ఉన్న పొదలకూరు నిమ్మ మార్కెట్ యార్డు రైతులు కాయలను విక్రయించుకునేందుకు, ఎగుమతులు జరుపుకునేందుకు అనుకూలంగా ఉంది. సీజన్‌లో ఈ మార్కెట్ యార్డు నుంచి ఢిల్లీతోపాటు పొరుగు రాష్ట్రాలకు సైతం అధికంగా కాయలు ఎగుమతి అవుతున్నాయి. ఆ మేరకు లాభసాటి ధరలు కూడా లభిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా మార్కెట్ యార్డులో సౌకర్యాల కల్పన, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటూ అండగా నిలుస్తోంది.

పొదలకూరు: జిల్లాలో పొదలకూరు నిమ్మ మార్కెట్ యార్డుకు ప్రత్యేక ప్రస్థానం ఉంది. వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని ఈ నిమ్మ మార్కెట్ యార్డును వివిధ ప్రభుత్వాల హయాంలో కొంత మేర అభివృద్ధి చేసినా వసతుల కల్పనతోపాటు వ్యాపారుల సమస్యలను పరిష్కరించిన ఘనత మాత్రం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుంది. ఈ మార్కెట్ యార్డుకు పొదలకూరు, రాపూరు, కలువాయి, చేజర్ల, మనుబోలు, సైదాపురం, సంగం, నెల్లూరు రూరల్, వెంకటాచలం తదితర మండలాల నుంచి రైతులు కాయలను తీసుకువస్తుంటారు.

13 ఎకరాల్లో మార్కెట్ యార్డు

పొదలకూరు ప్రభుత్వ మార్కెట్ యార్డుకు 2003 జూన్ 20వ తేదీన 13 ఎకరాల స్థలాన్ని కేటాయించి దుకాణాలకు వేలం పాటలు నిర్వహించారు. అప్పట్లో రోడ్లపై వ్యాపారాలు చేసుకునే నిమ్మ వ్యాపారులు యార్డుకు కష్టంగా వచ్చి వ్యాపారాలు మొదలుపెట్టారు. ఇపుడు యార్డు అతిపెద్దగా రూపుదాల్చి నిత్యం సుమారు 200 మందికి ఉపాధి కల్పిస్తోంది. రెండు దశాబ్దాల కాలంలో మార్కెట్ బాగా విస్తరించింది. ఏఎంసీ చైర్మన్లు, ప్రభుత్వాల కృషి ఫలితంగా కోట్లాది రూపాయలతో అంతర్గత సిమెంటురోడ్లు, అదనపు దుకాణాల నిర్మాణం జరిగింది. అదనంగా మరికొన్ని దుకాణాలను నిర్మిస్తామని గుంటూరు మార్కెటింగ్ శాఖ ఆర్జేడీ శ్రీనివాసరావు వెల్లడించారు. ఇటీవల 24 దుకాణాలకు వేలం పాటలు కూడా నిర్వహించారు. యార్డులో ఇపుడు మొత్తం 40 మంది వరకు వ్యాపారులు ఉన్నారు. వీరిలో సేల్స్ వ్యాపారులు (కాయలకు వేలం పాటలు నిర్వహించేవారు) 5 మంది, బయ్యర్లు(కొనుగోలు చేసేవారు) 35 మంది ఉన్నారు. రోడ్లు, ప్లాట్‌ఫామ్స్‌పై కాయలు కొనుగోలు చేసేవారు చాలామందే ఉన్నారు. మార్కెట్‌లో అంతర్గత సిమెంటు రోడ్లు, అదనపు దుకాణాల నిర్మాణం, ఓపెన్ మార్కెట్ కోసం ప్లాట్‌ఫాంల ఏర్పాటు, కార్బైడ్ రహితంగా కాయలను మగ్గబెట్టేందుకు లైఫింగ్(గ్యాస్) చాంబర్ నిర్మాణం, హమాలీలకు విశ్రాంతి గది తదితరుల సౌకర్యాలు ఉన్నాయి.



కొత్తగా నిర్మించిన దుకాణాలు

వ్యాపారులకు అండగా..

కోవిడ్ సమయంలోనూ మార్కెటింగ్ శాఖ చొరవ తీసుకుని వ్యాపారులకు అండగా నిలిచింది. కరోనా భయంతో వ్యాపారులు సుమారు నెల రోజుల పాటు మార్కెట్‌ను మూసివేసిన తర్వాత మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో క్రమక్రమంగా మార్కెట్ తెరుచుకుని తిరిగి రైతుల వద్ద కాయలు సేకరించి పొరుగు రాష్ట్రాలకు ఎగుమతులను ప్రారంభించారు.

మరింత విస్తరించేలా చర్యలు

యార్డులో అప్పట్లో మంచినీటి ట్యాంకు వ్యాపారుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని నిర్మించారు. ప్రస్తుతం వ్యాపారులు, రైతుల సంఖ్య పెరగడంతో మంచినీటి సమస్యలు తలెత్తుతున్నాయి. పెద్ద ట్యాంక్ నిర్మించాలని వ్యాపారులు కోరుతున్నారు. గతంలో నిర్మించిన 10 దుకాణాల వద్ద సిమెంటు రోడ్డు లేకపోవడంతో లారీలు దిగబడుతున్నాయి. అక్కడ అంతర్గత సిమెంటురోడ్డు నిర్మిస్తే సరిపోతుందని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మార్కెట్‌ను మరింత విస్తరించి సౌకర్యాలు పెంపొందించేందుకు ఒక ప్రణాళిక రూపొందించాల్సిందిగా మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు.

సీజన్‌లో పలు రాష్ట్రాలకు ఎగుమతులు

నిమ్మమార్కెట్‌లో సీజన్ జనవరి చివరి నుంచి ప్రారంభమవుతుంది. మే నెల వరకు నిమ్మకాయలకు సీజన్‌గా పరిగణిస్తారు. ఆ సమయంలో ధరలు బాగా లభించడం వల్ల రైతులు కాయలను యార్డుకు తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. సీజన్‌లో యార్డు నుంచి నిత్యం 15 లారీల కాయలు ఎగుమతి అవుతాయి. వాటి విలువ సుమారు రూ.50 లక్షల వరకు ఉంటుంది. మార్కెట్ కమిటీకి బస్తాకు రూ.5 వంతున సెస్‌చార్జీలు వసూలవుతున్నందున యార్డు నుంచి రాబడి కూడా బాగా ఉంటుంది. ఢిల్లీ మార్కెటే నిమ్మ ధరలను నిర్ణయిస్తుంది. ఢిల్లీ మార్కెట్ యార్డులోని వ్యాపారులు తరచూ ఇక్కడకు వచ్చి వ్యాపారులతో లావాదేవీలు కుదుర్చుకుని వెళుతుంటారు. దీంతో ఇక్కడి నుంచి ఢిల్లీ మార్కెట్‌కు కాయలు అధికంగా ఎగుమతి అవుతుంటాయి.



నిమ్మకాయల బస్తాలు లోడ్ చేస్తున్న కూలీలు (ఫైల్)

ఇబ్బందులు తలెత్తడం లేదు



పొదలకూరు నిమ్మమార్కెట్ రైతులకు దగ్గరగా ఉండడం వల్ల కాయలను ఎగుమతి చేసేందుకు ఇబ్బందులు తలెత్తడం లేదు. ధరలు కూడా బాగానే లభిస్తున్నాయి. వేసవిలో రైతులకు ధరలు లభిస్తున్నా, చలికాలం కొంత ఇబ్బంది తలెత్తుతోంది. నిమ్మకాయలకు కూడా గిట్టుబాటు ధర ఉంటే బాగుంటుంది.
– పెంచలనారాయణరెడ్డి, రైతు, అంకుపల్లి

మార్కెట్‌లో సౌకర్యాలు కల్పించాలి



నిమ్మమార్కెట్‌లో సౌకర్యాలు బాగున్నాయి. అయితే వేసవిలో జనాలకు మంచినీరు సరిపోవడం లేదు. కొత్తగా మరో ట్యాంకు నిర్మిస్తే తాగునీటి ఇబ్బందులు ఉండవు. మంత్రి కాకాణి ప్రత్యేక చొరవ తీసుకుని సౌకర్యాలు కల్పించాలి.
– ఎం.బాలకృష్ణారెడ్డి, వ్యాపారి

అదనపు దుకాణాలు నిర్మిస్తాం



యార్డులో అదనపు దుకాణాలు నిర్మిస్తాం. ప్రస్తుతం వ్యాపారులందరికీ లైసెన్సులను రెన్యువల్ చేస్తున్నాం. ప్లాట్‌ఫాం వ్యాపారులకు కూడా లైసెన్సులు అందజేస్తున్నాం. లైసెన్సులు లేనివారు యార్డులో కాయలు పట్టుకునేందుకు అవకాశం ఉండదు.
– నవీన్‌కుమార్‌రెడ్డి, సెక్రటరీ

యార్డును అభివృద్ధి చేస్తున్నాం



రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి చొరవతో నిమ్మ మార్కెట్ యార్డును అభివృద్ధి చేస్తున్నాం. అదనపు దుకాణాలు నిర్మిస్తాం. నిత్యావసర వస్తువులను రాయితీపై యార్డులో ప్రజలకు అందజేస్తున్నాం.
– పెదమల్లు రత్నమ్మ, ఏఎంసీ చైర్మన్

చిరు వ్యాపారులకు 'జగనన్న తోడు'



చిరు వ్యాపారులకు 'జగనన్న తోడు' చెక్కు అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్సీ

- కలెక్టర్ ఎం.హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): 'జగనన్న తోడు' చిరు వ్యాపారుల ఉపాధికి, ఆర్థికాభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అన్నారు. మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'జగనన్న తోడు' పథకానికి సంబంధించి చిరు వ్యాపారులకు వడ్డీ లేని రుణాన్ని సీఎం క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. నెల్లూరు నుంచి కలెక్టర్ హరినారాయణన్, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, మెప్మా పీడీ రవీంద్ర చిరు వ్యాపారులు వర్చువల్‌గా పాల్గొన్నారు. 19,085 మంది చిరు వ్యాపారులకు సంబంధించి రూ.19.08 కోట్ల మెగా చెక్కును తిక్కన ప్రాంగణంలో కలెక్టర్, ఎమ్మెల్సీ లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చిరు వ్యాపారులు, సంప్రదాయ వృత్తుల వారి ఆర్థికాభివృద్ధికి 'జగనన్న తోడు' పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. దీని వల్ల వేలాది మంది చిరు వ్యాపారులు తమ జీవనోపాధిని మెరుగుపరుచుకోవడానికి అవకాశం కలిగిందన్నారు.

జిల్లాలో 'జగనన్న తోడు' పథకం ద్వారా లబ్ధిదారులకు అందిన సాయం

ఫేజ్	లబ్ధిదారులు	నగదు (రూ.కోట్లలో..)
ఫేజ్-1	16,151	16.15
ఫేజ్-2	18,052	18.05
ఫేజ్-3	29,957	29.95
ఫేజ్-4	16,293	16.92
ఫేజ్-5	39,823	39.82
ఫేజ్-6	19,093	19.09
ఫేజ్-7(ఆగస్టు)	19,085	19.08
మొత్తం	1,59,084	159.06

పేదలు వడ్డీ వ్యాపారుల బారిన పడకుండా ప్రభుత్వమే వారికి బ్యాంకుల ద్వారా వడ్డీ లేని రుణాలు అందజేస్తుందన్నారు. 'జగనన్న తోడు' పథకం కింద జిల్లాలో ఇప్పటి వరకు దాదాపు 1,59,000 మందికి రూ.159 కోట్ల వడ్డీ లేని రుణాలు అందజేసినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ పేద ప్రజల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందన్నారు. వడ్డీ లేని రుణాలు అందజేసి చిరు వ్యాపారులను ఆదుకుంటుందని తెలిపారు. ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. ఈ సందర్భంగా చిరు వ్యాపారులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను కలెక్టర్, ఎమ్మెల్సీ పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు.

ఆనందంగా ఉంది



జ్యూట్ బ్యాగులు, కాటన్ బ్యాగులు కుట్టి అమ్ముకుంటున్నాం. ఇప్పటికి రెండుసార్లు 'జగనన్న తోడు' ద్వారా నగదు అందింది. మూడోసారి కూడా తీసుకుంటున్నాను. ఆనందంగా ఉంది. బ్యాంక్‌లో నెలనెలా సక్రమంగా చెల్లిస్తున్నాను.
– షేక్ సన్‌హిరా, దర్గామిట్ట, నెల్లూరు

చాలా ఉపయోగం



'జగనన్న తోడు' పథకం చాలా ఉపయోగకరంగా ఉంది. బ్యాగులు అల్లి అమ్ముకుంటున్నాం. మా బ్యాగులకు గిరాకీ పెరిగి ఆన్‌లైన్‌లో కూడా అమ్ముడవుతున్నాయి. మూడో విడతగా రూ.10 వేలు తీసుకుంటున్నాను. నెలనెలా సక్రమంగా కట్టేస్తున్నాను.
– చక్ర లలితాభాయ్, హౌసింగ్‌బోర్డు, కల్లూరుపల్లి, నెల్లూరు

పశుసంవర్ధక శాఖ డీడీగా నాగమణి

నెల్లూరు(సెంట్రల్): పశుసంవర్ధక శాఖ నెల్లూరు డివిజన్ డిప్యూటీ డైరెక్టర్‌గా డాక్టర్ ఎం.నాగమణి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. వైఎస్సార్ జిల్లా కాజీపేటలో ఏడీగా ఉన్న నాగమణిని పదోన్నతిపై నెల్లూరు డీడీగా ఆ శాఖ ఉన్నతాధికారులు నియమించారు. బాధ్యతలు చేపట్టిన డీడీని డాక్టర్ వసంత్, డాక్టర్ జయప్రకాష్, డాక్టర్ రామచంద్రారెడ్డి తదితరులు మర్యాద పూర్వకంగా కలిశారు.



డీడీని కలిసిన డాక్టర్లు

పక్కాగా ఓటరు జాబితా

- రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధాన కార్యదర్శికి తెలిపిన కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలు జారీ చేసిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ ప్రత్యేక ఓటరు సవరణ, నమోదు కార్యక్రమాన్ని పటిష్టంగా చేపడుతూ ఓటరు జాబితాను పక్కాగా రూపొందించేందుకు చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ ఎం.హరినారాయణన్ తెలిపారు. మంగళవారం వెలగపూడిలోని సచివాలయం నుంచి రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధాన కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు నెల్లూరు కలెక్టరేట్‌లోని తన చాంబర్ నుంచి కలెక్టర్ హరినారాయణన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో ప్రత్యేక ఓటరు నమోదు, సవరణ కార్యక్రమం, ఫాం-6, 6ఏ, 7, 8 నమోదు వివరాలను సీఈఓకు కలెక్టర్ వివరించారు. జిల్లాలో 26,488 ఓటరు క్లయిమ్‌లు వచ్చాయని, 12,885 క్లయిమ్‌లను ఓటరు జాబితాలో అప్‌డేట్ చేయగా, 10,397 పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఫాం-6కు సంబంధించి 14,769, ఫాం-6ఏకు సంబంధించి ఒకటి, ఫాం-7కు సంబంధించి 5,832, ఫాం-8కు సంబంధించి 5,886 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. అలాగే ఓటరు చేర్పులు, మార్పులకు సంబంధించి చర్యలు చేపట్టామన్నారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులకు ఓటు హక్కు కల్పించేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో వెంకటనారాయణమ్మ, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డ్వామా పీడీ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

783 పొగాకు బేళ్ల కొనుగోలు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలంలోని డీసీపల్లి వేలం కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పొగాకు వేలంలో తిక్కవరం క్లస్టర్ రైతుల నుంచి రూ.2.29 కోట్లకు పైగా విలువ గల 783 పొగాకు బేళ్లను కొనుగోలు చేశామని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. మొత్తం 860 బేళ్లను రైతులు వేలం కేంద్రానికి తీసుకురాగా, వాటిలో 77 బేళ్లను తిరస్కరించినట్లు తెలిపారు. కిలో పొగాకుకు అత్యధిక ధర రూ.245, అత్యల్ప ధర రూ.150, సగటు ధర రూ.230.62గా నమోదైనట్లు తెలిపారు.

సోమశిలలో 25.208 టీఎంసీలు

చేజర్ల (సోమశిల): సోమశిల జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 25.208 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు నుంచి 1,764 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది. కాగా పెన్నార్ డెల్టాకు 1,700, ఉత్తర కాలువకు 280 దక్షిణ కాలువకు 200 కండలేరుకు 10 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు.

క్లుప్తంగా

వ్యవసాయ శాఖ అధికారుల విచారణ



విచారణ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్‌రాజు

జలదంకి: మండలంలోని బ్రాహ్మణక్రాక రైతు భరోసా కేంద్రంలో 2022 ఖరీఫ్ సమయంలో పంట నష్టం వివరాల నమోదులో అవకతవకలు జరిగాయని వచ్చిన ఆరోపణలపై వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. అదే సమయంలో స్థానిక రైతులు పలువురు ఆర్బీకే వద్ద ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ ఆర్బీకే పరిధిలో 2022 ఖరీఫ్ సమయంలో పంట నష్టపోయిన 58 మందికి రూ.78 లక్షలను ప్రభుత్వం ఇచ్చిందన్నారు. అయితే వీఏఏ ప్రత్యూష, కొందరు సిబ్బంది కుమక్కై అర్హుల పేర్లు నమోదు చేయకుండా అనర్హులకు ఆ నగదు అందేలా చేశారని ఆరోపించారు. కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేయడంతో జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్‌రాజు, ఏడీఏ నర్సోజీరావు, వింజమూరు ఏడీఏ రామిరెడ్డి జలదంకి వ్యవసాయ శాఖ కార్యాలయానికి వచ్చారు. వీఏఏ, సిబ్బందిని విచారించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ ప్రత్యేకాధికారులను నియమించి పూర్తిస్థాయిలో విచారణ చేయిస్తామన్నారు. అవినీతి జరిగినట్లు తేలితే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మండల ఏఓ శైలజ పాల్గొన్నారు.

ఈఓ, హాఫీజ్‌ల మధ్య వివాదం

అనుమసముద్రంపేట: మండల కేంద్రంలోని హజరత్ నాయబ్ రసూల్ దర్గాలో వక్ఫ్ బోర్డు ఈఓ హుస్సేన్ బాషా, సజ్జదా హాఫీజ్ పాషాల మధ్య వివాదం నెలకొంది. తనపై హాఫీజ్ దాడి చేశారంటూ ఈఓ ఆరోపిస్తున్నారు. స్థానికుల కథనం మేరకు.. కొద్దినెలల క్రితం ముతవల్లిగా ఉన్న హాఫీజ్‌పై అనేక ఆరోపణలు రావడంతో వక్ఫ్‌బోర్డు అధికారులు ఆయన్ను తొలగించారు. అదే క్రమంలో జిల్లా బోర్డు ఆధ్వర్యంలో దర్గాలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కాగా సోమవారం అర్ధరాత్రి హాఫీజ్ అనుచరులతో కలిసి దర్గా ఈఓ హుస్సేన్ బాషా ఆఫీస్ వద్దకు వెళ్లారు. గలేఫాలు తీసుకెళ్లే క్రమంలో ఈఓ, హాఫీజ్ మధ్య వాగ్వాదం జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి ఇరువర్గాలకు సర్ది చెప్పారు. ఇదిలా ఉండగా హాఫీజ్ తనపై దాడికి యత్నించారని ఈఓ మంగళవారం వక్ఫ్ బోర్డు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. దీనిపై ఈఓ మాట్లాడుతూ దర్గా మాదే, హుండీలు మావేనంటూ హాఫీజ్ గొడవలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని వాపోయారు. కోర్టు ఉత్తర్వులిచ్చే వరకు ఆయన కేవలం దర్గాలో ప్రార్థనలు మాత్రమే చేయాలన్నారు.

దాడి చేయలేదు

ఈఓ హుస్సేన్‌పై దాడి చేశామంటూ వస్తున్న ప్రచారం అబద్ధమని హాఫీజ్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోర్టు ఆదేశాల ప్రకారమే విధులు నిర్వహిస్తామన్నారు.

వైద్య శాఖ ఉద్యోగులపై విచారణ నేడు

నెల్లూరు(బారకాసు): జిల్లాలో గతంలో డీఎంహెచ్ఓగా విధులు నిర్వర్తించి ప్రస్తుతం ప్రకాశం జిల్లా వైద్యారోగ్య శాఖాధికారిగా పని చేస్తున్న డాక్టర్ రాజ్యలక్ష్మిని బుధవారం రీజినల్ డైరెక్టర్, విచారణాధికారి డాక్టర్ జొన్నలగడ్డ యాస్మిన్ విచారించనున్నారు. కోవిడ్ నిధులు, ఆస్పత్రుల రిజిస్ట్రేషన్లు, కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్న హెల్త్ అసిస్టెంట్స్ బదిలీలు, డెప్యుటేషన్లలో అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారంటూ రాష్ట్ర ఉన్నతాధికారులకు గత సంవత్సరం సెప్టెంబర్‌లో ఫిర్యాదులు వెళ్లాయి. పరిశీలించిన ఉన్నతాధికారులు రాజ్యలక్ష్మిపై విచారణ చేపట్టాలని ఆర్డీని ఆదేశించారు. అయితే రెండుసార్లు తేదీలు ప్రకటించినా ఆర్డీ విచారణను వాయిదా వేశారు. ఈసారి కచ్చితంగా చేపట్టే అవకాశం ఉందని ఆ శాఖ వర్గాలు చెబుతున్నాయి. అప్పట్లో రాజ్యలక్ష్మితోపాటు ఆ శాఖలో పనిచేస్తున్న కార్యాలయ పరిపాలనాధికారి, సూపరింటెండెంట్, అకౌంటెంట్, ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగంలోని సీనియర్ అసిస్టెంట్లందరూ, అప్పటి ఇన్‌చార్జి డెమోగా పనిచేసిన ఉద్యోగిని కూడా విచారించనున్నారు. బుధవారం సంతపేటలోని జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో జరిగే విచారణకు హాజరుకావాలని ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 116
లేయర్ (లైవ్)	: 92
బ్రాయిలర్ చికెన్	: 204
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 228
లేయర్ చికెన్	: 156



నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.26
సన్నవి	: రూ.12
పండ్లు	: రూ.5

పవన్ కళ్యాణ్ రాజకీయ అజ్ఞాని

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మహిళకు సర్టిఫికెట్ అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: 'ప్రజలకు ఎంతో మేలు చేస్తున్న వలంటీర్ల వ్యవస్థను జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ తప్పు పడుతున్నారు. ఆయన రాజకీయ అజ్ఞాని' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. వెంకటాచలం మండలం కసుమూరు గ్రామ సచివాలయంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. లబ్ధిదారులకు రేషన్‌కార్డులు, ఆదాయ, కుల, జనన మరణ తదితర సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలను పారదర్శంగా అమలు చేయాలనే ఆలోచనతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థను తీసుకొస్తే చంద్రబాబు, పవన్ తప్పు పట్టడం సరికాదన్నారు. బటన్ నొక్కితేనే సంక్షేమమా అని మాట్లాడిన బాబు, తాము అధికారంలోకి వస్తే ఐదు బటన్లు నొక్కుతామని చెప్పడం ప్రజలను మోసం చేయడానికేనని విమర్శించారు. అధికారం కోసం బాబు అబద్ధాలు చెబుతున్నాడు తప్ప ప్రజలకు మేలు చేసే ఆలోచన ఆయనకు లేదన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో రెవెన్యూ పరమైన సమస్యలు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. తనకు రెండు దఫాలు ఓట్లు వేసి గెలిపించిన సర్వేపల్లి నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకునే విధంగా పని చేస్తానన్నారు. సర్వేపల్లిలో గతంలో పనిచేసిన ఎమ్మెల్యేల కంటే అధికంగా అభివృద్ధి పనులు తాను చేశానని నమ్మితేనే ఆదరించాలని ధైర్యంగా చెబుతున్నానన్నారు. గతంలో ప్రజలు అధికారుల చుట్టూ తిరిగే వారిని, ప్రస్తుతం వైఎస్ జగన్ ప్రజల ముంగిటకే పాలన తీసుకొచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ వసుమతి, తహసీల్దార్ కృష్ణ, ఎంపీపీ మందా కవిత, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య, ఎంపీటీసీ ఉమ్మిడిశెట్టి కవిత, సర్పంచ్ కడివేటి శివ, ఉప సర్పంచ్ బాబర్, వైఎస్సార్‌సీపీ నాయకులు చీకుర్తి నరసయ్య, ఉమ్మిడిశెట్టి శేషయ్య, హుస్సేన్, గుర్రం పుట్టయ్య, మందా కృష్ణ, దస్తగిరి, నాగేశ్వరరావు, జనార్దన్ పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా రొట్టెల పండగ

- కమిషనర్ వికాస్ మర్మత్



ఏర్పాట్ల గురించి ఆరా తీస్తున్న కమిషనర్

నెల్లూరు(బారకాసు): ఈనెల 29వ తేదీ నుంచి బారాషహీద్ రొట్టెల పండగను నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిషనర్ వికాస్ మర్మత్ తెలిపారు. దర్గా వద్ద చేస్తున్న ఏర్పాట్లను కమిషనర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షామియానాలు, కమాండ్ కంట్రోల్, వీఐపీ రిసెప్షన్, సీసీ కెమెరాలు, విద్యుత్, పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు, పార్కింగ్, బారికేడ్ల నిర్మాణం, స్వర్ణాల చెరువు వెంబడి భద్రతా చర్యలు తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. అన్ని ప్రభుత్వ విభాగాలను సమన్వయం చేసుకుని పండగను ఘనంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు.

- నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని స్థానిక 21/3 మాగుంట లేఅవుట్ సచివాలయాన్ని కమిషనర్ వికాస్ మర్మత్ తనిఖీ చేశారు. అలాగే 13వ డివిజన్‌లో జరుగుతున్న చెత్త సేకరణ పనులను పరిశీలించారు. అన్ని డివిజన్లలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట కార్పొరేటర్ నాగార్జున, ఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ, శానిటరీ సూపర్‌వైజర్లు, సచివాలయాల శానిటరీ సెక్రటరీలున్నారు.

కాలువలో పడి జింక మృతి

వెంకటాచలం: దాహార్తి తీర్చుకునేందుకు వచ్చిన జింకను కుక్కలు వెంబడించాయి. దీంతో ఆ మూగజీవం సైడ్ కాలువలో పడి మృతిచెందిన ఘటన వెంకటాచలంలో మంగళవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. వెంకటాచలం సమీప అడవుల్లో నుంచి గ్రామంలోకి జింక రావడంతో కుక్కలు దానిని వెంబడించాయి. తప్పించుకునే క్రమంలో జింక సైడు కాలువలో పడి చనిపోయింది. స్థానికులు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు.

'జగనన్న సురక్ష'తో పేదలకు మేలు



మహిళకు సర్టిఫికెట్ అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ, ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

బుచ్చిరెడ్డిపాళెం: 'జగనన్న సురక్ష' కార్యక్రమం ద్వారా పేదలకు ఎంతో మేలు జరుగుతోందని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని వవ్వేరు గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాదయాత్రలో ప్రజల సమస్యలను కళ్లారా చూసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక పరిష్కారానికి అనేక చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. పేదల కోసం సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రతి ఇంటికీ వెళ్లి పథకాల వల్ల జరిగిన లబ్ధిని వివరిస్తునట్లు చెప్పారు. ఇంకా సమస్యలను తెలుసుకోవడంతోపాటు వాటిలో కొన్నింటిని వ్యక్తిగతంగా పరిష్కరించడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా కోవూరు నియోజకవర్గ అభివృద్ధికి జిల్లా పరిషత్ నుంచి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

త్వరలోనే వవ్వేరు రోడ్డు పనులు ప్రారంభం

బుచ్చిరెడ్డిపాళెం నుంచి వవ్వేరు గ్రామానికి రోడ్డు అభివృద్ధి పనులను మరో 15 రోజుల్లో ప్రారంభిస్తామని ఎమ్మెల్యే ప్రసన్న తెలిపారు. అలాగే వవ్వేరు గ్రామంలో 21 ఐరన్ విద్యుత్ స్తంభాలు ఉన్నాయని, వీటి వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని తెలుసుకుని తొలగించేందుకు రూ.2.48 లక్షలను మంజూరు చేశామన్నారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు వివిధ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, వైస్ చైర్‌పర్సన్ కోటంరెడ్డి లలితారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు చెర్లో సతీష్‌రెడ్డి, టంగుటూరు మల్లికార్జున్‌రెడ్డి, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, శ్రావణ్, పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు, మోర్ల మురళి, మేనకూరు సీతారామిరెడ్డి పాల్గొన్నారు.

పేదరికాన్ని నిర్మూలించడమే లక్ష్యం



ఇంటి లబ్ధిదారుకు నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: 'పేదరికాన్ని నిర్మూలించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారు. అనేకమంది పథకాలు అందుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు.' అని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని 17, 19, 20 వార్డుల సచివాలయం పరిధిలో మంగళవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సురక్ష అనే వినూత్న కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కరించడంతోపాటు 11 రకాల సేవలకు సంబంధించిన సర్టిఫికెట్లు ఉచితంగా ఇవ్వడం మంచి పరిణామమన్నారు. రికార్డు స్థాయిలో 1,350 మందికి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు.

ఎరుకలకు ఎస్టీ సర్టిఫికెట్లు

రెండు దశాబ్దాలుగా ఎరుకలసాని నగర్‌కు చెందిన అనేక కుటుంబాలు ఎస్టీ కుల ధ్రువీకరణ సర్టిఫికెట్లు పొందలేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను గతంలో దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనికి సంబంధించి సచివాలయ సిబ్బంది అనేక రుజువులను పొందుపరచడంతో ఎట్టకేలకు 300 మందికి ధ్రువీకరణ పత్రాలు అందజేయడంతో ఆయా కుటుంబాలు సంతోషం వ్యక్తం చేశాయి. వైఎస్సార్ జగనన్న కాలనీలో ఇళ్లు నిర్మించుకునేందుకు పొదుపు మహిళలకు ఒక్కొక్కరికి రూ.35 వేలు చొప్పున ఎమ్మెల్యే చేతుల మీదుగా రుణ సహాయం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జి.వెంకటరమణమ్మ, వైస్ చైర్మన్ షేక్ సర్దార్, కమిషనర్ బి.నాగేశ్వరరావు, కౌన్సిలర్లు కొండా స్వరూపరాణి, కోడూరు కౌసల్యమ్మ, కో–ఆప్షన్ మెంబర్ ఎస్.కృపావరమ్మ, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, సొసైటీ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, కొండా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అర్హులకు ప్రభుత్వ పథకాలందేలా చర్యలు

- కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి



బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

అల్లూరు: అర్హులకు పక్కాగా సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకున్నట్లు కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఇందుపూరు గ్రామంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం జరిగింది. ఇందులో ఎమ్మెల్యే పాల్గొని ఇంటింటికీ వెళ్లి పథకాలు అందుతున్నాయా? లేదా? అని ఆరాతీశారు. బుక్‌లెట్లు పంపిణీ చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం మహిళలు పేరు మీద ఇళ్ల పట్టాలు ఇచ్చిందన్నారు. గృహాలు కూడా కట్టిస్తోందన్నారు. అమ్మఒడి, ఆసరా, చేయూత, విద్యా దీవెన, వసతి దీవెన పథకాలు పేదలకు అండగా నిలిచాయన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కొందరు మాయమాటలు చెబుతున్నారని, వారికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల సిఫార్సు లేనిదే ఎవరికీ పథకాలు అందేవి కాదన్నారు. ఇప్పుడు అర్హులందరికీ సంక్షేమం అందుతున్నట్లు చెప్పారు. ఇలాంటి పారదర్శక పాలన తన రాజకీయ జీవితంలో ఎప్పుడూ చూడలేదన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ రెహానా బేగం, ఎంపీపీ శశిరేఖ, నాయకులు నీలం సాయికుమార్, బీద రమేష్, సాధక్ రెడ్డి, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, మునిరాజ్, కోండూరు శ్రీను, రంజిత్ కుమార్, కామేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సంచార జాతుల సంక్షేమానికి పెద్దపీట



మాట్లాడుతున్న చైర్మన్ వీరన్న

- ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెంద్ర వీరన్న
- సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం

నెల్లూరు(వేదాయపాళెం): 'సంచార జాతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మేమంతా రుణపడి ఉంటాం.' అని రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెంద్ర వీరన్న అన్నారు. నెల్లూరు దర్గామిట్టలోని అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం జరిగిన సంచార జాతుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంచార జాతుల సంక్షేమం, అభివృద్ధికి అనేక చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన జీఓ నంబర్ 8 ప్రకారం 32 సంచార జాతుల ఉప కులాలను బీసీ–బీ జాబితాలో చేర్చడం గర్వకారణమన్నారు. తోలుబొమ్మలాట తదితర సంచార జాతుల కులాలకు ధ్రువీకరణపత్రాల మంజూరు, వంద యూనిట్ల విద్యుత్ రాయితీ, వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు, కమిటీ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. అమ్మఒడి, జగనన్న కాలనీలు తదితర పథకాల్లో అవకాశం లభించిందన్నారు. సంచార జాతులను రాజ్యాంగం పరిధిలోకి చేర్చాలని, 2008 బాలకృష్ణ రేణుక సంచార జాతుల జాతీయ కమిషన్ ఇచ్చిన నివేదిక ప్రకారం కేంద్ర ప్రభుత్వం పదిశాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. అనంతరం సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు దుద్దుగుంట శ్రీనివాసులురెడ్డి, మూలే విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు మొయిళ్ల సురేష్‌రెడ్డి, సుబ్బారెడ్డి, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చేమూరు రవికుమార్, నవ్యాంధ్ర ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదూరు రత్నం పాల్గొని సంఘీభావం ప్రకటించారు. సమావేశంలో సంచార జాతుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్నపరెడ్డి శేఖర్, తోలుబొమ్మలాట సంఘం జిల్లా అధ్యక్షుడు బిందె శివ, సంచార జాతుల సంఘం జిల్లా అధ్యక్షుడు సిందే చినకొండయ్య పాల్గొన్నారు.